క్లుప్తంగా

నూతన కార్యవర్గం



పట్టణ వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటీ

జంగారెడ్డిగూడెం: పట్టణ వెలమ సంక్షేమ సంఘం, మాజీ అధ్యక్షుడు గాలి నూకరాజు అధ్యక్షతన, తాండ్ర పాపారాయుడు సెంటర్, వెలమ రామాలయం ఆవరణలో వెలమ సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం పట్టణ వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భీమిరెడ్డి జోగిబాబు, ఉపాధ్యక్షులుగా రొంగల దేవీప్రసాద్, ఈదుపల్లి అప్పారావు, బంగారు శ్రీనివాస్, కార్యదర్శిగా పైల చంటి, కోశాధికారిగా గొట్టాపు రామారావు, ఆర్గనైజరుగా చిటికెల రాంబాబు, సహాయ కార్యదర్శులుగా బేతా రమేష్, రాయపూడి శ్రీను, కొట్నాని అచ్యుతరావు, ప్రచార కార్యదర్శిగా నౌడు దుర్గారావు, 18మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు



చోరీ చేసిన బైక్‌పై వెళుతున్న వ్యక్తి (సీసీ పుటేజీలోని దృశ్యం)

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలో పనిచేసే ఒక ఉద్యోగి బైక్ సోమవారం చోరీకి గురైంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవస్థానం రికార్డ్ అసిస్టెంట్ పాకనాటి వెంకటేష్ మధ్యాహ్నం ఏపీ 16 డీఆర్ 2304 నెంబర్ గల తన హూండా షైన్ బైక్‌ను ఉగాది మండపం వెనుక రోడ్డులోని తన ఇంటి ముందు పార్క్ చేశాడు. భోజనం చేసి బయటకు వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కలా వెదికినా ఫలితం దక్కలేదు. చివరకు గుడి సెంటర్‌లోని విలాస మండపం వద్ద ఉన్న దేవస్థానం సీసీ కెమేరా పుటేజ్‌ను పరిశీలించగా, గుర్తు తెలియని ఒక వ్యక్తి బైక్‌పై స్థానిక తూర్పు వీధిలోనుంచి గుడి సెంటర్ వైపునకు వెళ్లినట్టు రికార్డ్ అయ్యింది. దీంతో బైక్ చోరీకి గురైనట్టు నిర్ధారించుకున్న బాధితుడు వెంకటేష్ సీసీ పుటేజీలతో సహా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వైఎస్సార్ సీపీ నేతల సాయం



ఆర్థిక సహాయం అందజేసిన వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డి తదితరులు

లింగపాలెం: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ సీపీ నేతలు ఆర్థిక సహాయం అందజేశారు. భోగోలు గ్రామానికి చెందిన సత్తా రాజేష్, సుమలత దంపతుల కుమారుడు రాజారూపాస్ (9) గత కొన్నేళ్లగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడికు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నారు. అయితే వారి ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉండడంతో వైద్యఖర్చుల కోసం సైతం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు వారికి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ నేత బీవీఎస్ రెడ్డి రూ.20 వేలు, భోగోలు గ్రామానికి చెందిన రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు రూ.5 వేలు, ముడిచెర్ల గ్రామానికి చెందిన అబ్బాయి రెడ్డి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి శాంతరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్ విజయదుర్గకు సత్కారం



సర్పంచ్ విజయదుర్గను సన్మానిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తదితరులు

పోలవరం రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరులో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా ఉత్తమ సర్పంచ్‌గా అవార్డును అందుకున్న కొత్తపట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గను సోమవారం గ్రామంలో సత్కరించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, గ్రామస్తులు విజయదుర్గను అభినందించి, దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు అడ్డగర్ల సాయిబాబ, ఉపసర్పంచ్ రంబ వాసు, వార్డు సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయాన్ని పరిశీలించిన సీసీఎఫ్

పోలవరం రూరల్: పోలవరం అటవీశాఖ కార్యాలయాన్ని సీసీఎఫ్ వై.శ్రీనివాసరెడ్డి సోమవారం పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందితో అటవీ శాఖ పరిధిలో ఉన్న సమస్యలపై చర్చించారు. ముందుగా ఈయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంత పనులను పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో ఎంతవరకు అటవీ ప్రాంతం ముంపునకు గురైంది, ఎంత వరకు కేటాయించారు అనే విషయాలను తెలుసుకున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా ఈ ప్రాంతానికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తుల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు



నియోజకవర్గస్థాయి విజేతలతో జెడ్పీటీసీ నీరజ సుధాకర్, ఎంపీపీ డా రాంబాబు నాయక్, అధికారులు

చింతలపూడి: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయని ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్ తెలిపారు. చింతలపూడి నియోజకవర్గ ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ క్రీడాకారులను వెలికితేసేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ పోటీల్లో యువ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం , శారీరక సామర్థ్యం పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్టా వేణు మాట్లాడుతూ నాలుగు మండలాల నుంచి సుమారు 40 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. చింతలపూడి సచివాలయం – 4 పురుషుల టీమ్ వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి, చింతలపూడి సచివాలయం – 1 పురుషుల టీమ్ కబడ్డీ పోటీల్లో మొదటి స్థానం, లింగపాలెం మండలం గోకవరం సచివాలయం – 1 టీమ్ ఖోఖో పోటీల్లో మొదటి స్థానం, జంగారెడ్డిగూడెం జట్టు షటిల్ బాడ్మింటన్ పోటీల్లో మొదటి స్థానం, చింతలపూడి సచివాలయం – 2 టీమ్ క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా మహిళల కబడ్డీ పోటీల్లో చింతలపూడి ప్రథమ స్థానం సాధించగా, మహిళల వాటీబాల్, ఖోఖో, షటిల్ పోటీల్లో జంగారెడ్డిగూడెం టీమ్‌లు ప్రథమ స్థానం సాధించాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, హెచ్‌ఎం సుధాకర్, మండల కోఆర్డినేటర్ సీమోను, నాలుగు మండలాల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

కొయ్యలగూడెం: పోలవరం డీఎస్పీ డి.రత్నరాజు సోమవారం కొయ్యలగూడెంలో అట్రాసిటీ కేసు పై విచారణ నిర్వహించారు. ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మపై అదే గ్రామానికి చెందిన గన్నే లక్ష్మీ తులసి, షేక్ బాజీ, లియో కత్, షేక్ రెహమాన్ కులం పేరుతో దూషించి దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో ఆయన విచారణ నిర్వహించారు. ఈ ఘటనపై గత నెల 21వ తేదీన ఫిర్యాదు రాగా ఎస్సై జీజే విష్ణు వర్ధన్ కేసు నమోదు చేశారని దీనిపై విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: టి.నరసాపురం, బొర్రంపాలెం 33/11 కేవీ విద్యుత్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో రోడ్ క్రాసింగ్‌లైన్ పనులు నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. కావున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు టి.నరసాపురం, బొర్రంపాలెం, గుర్వాయిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిర్వాసితులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న పోలవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: చల్లావారిగూడెం శివారులో గల నిర్వాసిత గ్రామాలైన, శ్రీరామపురం, జగన్నాథపురం, చిగురుమామిడి, నార్లవారిగూడెం, కొయిద, కట్టుకురు గ్రామాల్లో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి సోమవారం పర్యటించారు. ఎమ్మెల్యే బాలరాజు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వాసిత గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్ని సదుపాయాలను నిర్వాసితులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీ అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే వచ్చేలా చేస్తానని అధైర్య పడవద్దని ఎమ్మెల్యే బాలరాజు హామీ ఇచ్చారు. నిర్వాసితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను మొదటిసారిగా కలిసిన రోజునే నిర్వాసితుల సమస్యల పరిష్కారం చేయాలంటూ విన్నవించడం జరిగిందన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, రిజిస్ట్రేషన్లు, ఉపాధి కల్పించడం వంటి సమస్యలను పరిష్కరిస్తామని రాజ్యలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన ప్రతి ఒక్కటి తాను నిర్వాసితులకు అందేలా చూస్తానని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండ



వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు నగదును అందిస్తున్న విజయరాజు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ కార్యకర్త యడ్లపల్లి వెంకటేశ్వరరావు కుటుంబానికి పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు సేకరించిన నగదు రూ.75 వేలను విజయరాజు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. వెంకటేశ్వరరావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ నగదును సేకరించడానికి కృషి చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, నాయకులు కేమిశెట్టి మల్లిబాబు, అయినాల వెంకటరమణమూర్తిలను పార్టీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారధి, పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, వార్డు కౌన్సిలర్ నేకూరి కిషోర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడమటి గిరిబాబుగౌడ్, నాయకులు బత్తిన చిన్న, గూడపాటి రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థకు ఆంధ్రప్రదేశ్ దిక్సూచి



రాజవరం హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: దేశంలో విద్యా వ్యవస్థకు ఒకనాడు కేరళ రాష్ట్రం ఆదర్శంగా ఉండేదని కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ దిక్సూచిగా మారిందని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలనే సాధ్యమైందని విద్యా వైద్య జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, జెడ్పీటీసీ దాసరి శ్రీ లక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం రాజవరం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు 76 ట్యాబ్‌లను హెచ్‌ఎం బి.రామారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా వ్యవస్థ పనితీరులో కేంద్రం నిర్వహించిన ఓ సర్వేకిగాను 2021–22 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ తొలి స్థానం దక్కించుకుందని, ఇది మన అందరికీ గర్వకారణం అన్నారు. కేంద్ర సర్వేలో 1000 పాయింట్లు ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వగా 902 పాయింట్లు దక్కించుకుని మన రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. జగన్ మేనమామ నమ్మకం వమ్ము చేయకుండా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాలలో నిలబడాలని ఆమె కోరారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, తమ్మిర్చి బ్రహ్మన్న, మాజీ సర్పంచ్ పాముల నాగముని స్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్, ఏలేటి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వొట్టిపోలు నాగరాజు, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, తమ్మిసెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం రోడ్డు సమస్యకు మోక్షం



బుట్టాయగూడెం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కంభం విజయరాజు, బత్తిన లక్ష్మి, పార్టీ నాయకులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డుకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్లుగా అధ్వాన్నంగా ఉండి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోడ్డు నిర్మాణాన్ని సోమవారం ప్రారంభించారు. చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంభం విజయరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ పట్టణంలోని బుట్టాయిగూడెం రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా ఉందని, ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై కౌన్సిల్ స్పందించి ఆ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిందన్నారు. గత ప్రభుత్వాల పాలనలో రోడ్డు నిర్మాణాల విషయంలో తీసుకున్న అలసత్వమే నేటి రోడ్ల పరిస్థితికి కారణమని ఆయన పేర్కొన్నారు. కాగా స్థానిక బుట్టాయగూడెం రోడ్ పొట్టి శ్రీరాములు బొమ్మ వద్ద నుంచి ఎస్సార్ బంకు వరకు రూ.1.70 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారథి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబుగౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, బత్తిన చిన్న, కౌన్సిలర్‌లు, చిప్పాడ వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ స్లీవజోజికి సత్కారం



జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవజోజిని సత్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డును అందుకున్న జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కె.స్లీవజోజిని సోమవారం జంగారెడ్డిగూడెం పట్టణ పరిసర ప్రాంతాల ఆటో ఓనర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ చేతుల మీదుగా వృద్ధులు, వితంతువులు, పేదలు సమారు 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి దుర్గారావు, వైస్ ప్రెసిడెంట్ మనెల్లి అమృతరావు, కార్యదర్శి కోనేరు వెంకట నారాయణ, కోశాధికారి కాసారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- 3వ వార్డులో 'మన ఊరు, మన వార్డు' కార్యక్రమం



మన ఊరు, మన వార్డు కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు మున్సిపల్ కౌన్సిల్ కృషిచేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో సోమవారం మన ఊరు మన వార్డు కార్యక్రమం 3వ వార్డులోని 2వ సచివాలయం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బత్తిన లక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధికి అన్ని విధాలుగా దోహదపడుతుందన్నారు. పట్టణంలో మౌలిక వసతులకు అవసరమైన నిధులను సమకూర్చడంలో చేయూతను అందిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో నెలకొన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర విషయాలు తెలుసుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు మన ఊరు, మన వార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా కృషిచేస్తామన్నారు. అనంతరం 3వ వార్డులో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న ప్రజలు గంగిరెడ్డి చెరువు గట్టు దగ్గర ఉన్నటువంటి కలవట్టు పనులు త్వరగా ప్రారంభించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన చైర్‌పర్సన్ సమస్యను 2 వారాల్లో పూర్తిచేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, కమిషనర్ భవానీప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, స్థానిక కౌన్సిలర్ మేక రమాదేవి సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, అయినాల వెంకటరమణమూర్తి, నేకూరి కిషోర్, పార్టీ నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, కంచర్ల విష్ణు, నేట్రు గణేష్, పెసరగంటి త్రిమూర్తులు, తల్లాడ సంజయ్, గెద్దాడ శీను, గుబ్బల బాస్, కె.ప్రకాష్, షేక్ జహీర్, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన తప్పనిసరి



ఐటీడీఏలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు

బుట్టాయగూడెం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీఐడీ విభాగం డీఎస్పీ సీహెచ్ పెంటారావు అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో సోమవారం అట్రాసిటీ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ చట్టం ఆవశ్యకతను ఆయన వివరించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ పీవీఎస్ నాయుడు మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించిన కమిటీల గురించి, రాజ్యాంగ పరమైన హక్కుల గురించి తెలియజేశారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు చేస్తున్న అభివృద్ధి విధానంపై కూడా వివరించారు. సీఐడీ డీఎస్పీ పి.రామకృష్ణ, డాక్టర్ పున్నయ్య కమిషన్ గురించి, గిరిజన బాధితులకు రావాల్సిన నష్టపరిహారం గురించి తెలిపారు. డీఎస్పీ రత్నరాజు, ఎస్సీ, ఎస్టీ(పీఏఓ) యాక్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయికే బొజ్జి, జలగం రాంబాబుతోపాటు, సీఐడీ ఇన్‌స్పెక్టర్ పీవీవీ నరసింహారావు, జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్, బుట్టాయగూడెం ఎస్సై వెంకన్న, సీఐడీ ఎస్సైలు కె. ఫణికుమార్, వై. శ్రీనివాసరావు, గాయత్రి, సిబ్బంది, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ



పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయానికి దాతలు అందజేసిన విగ్రహాలు

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రం వీరేశ్వరస్వామి ఆలయానికి పంచలోహ విగ్రహాలను దాత బహూకరించినట్లు దేవస్థానం ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ తెలిపారు. శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామికి రాజమహేంద్రవరానికి చెందిన మడిచర్ల సుధాకరరావు, వెంకటలక్ష్మి దంపతులు పంచలోహ విగ్రహాలను, సింహాసనాన్ని దేవస్థానానికి అందజేసినట్లు చెప్పారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కుక్కునూరు: లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన సోమవారం మండలంలోని కొర్లకుంట గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బూర్గంపాడు నుంచి అశ్వారావుపేట వైపుగా పొట్టును తరలిస్తున్న లారీ సోమవారం తెల్లవారుజామున కొర్లకుంట గ్రామ సమీపాన అదుపు తప్పి రోడ్డు ప్రక్కకు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

లక్కవరం ఎస్సైగా సుధీర్ బాధ్యతల స్వీకరణ



జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం పోలీస్ స్టేషన్ ఎస్సైగా టి.సుధీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ద్వారకాతిరుమల ఎస్సైగా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, కోడి పందేలు వంటి జూదక్రీడలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను చట్టపరంగా పరిష్కరించేలా కృషి చేస్తానని ఎస్సై చెప్పారు.

జంగారెడ్డిగూడెం ఎస్సైగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్సైగా జి.జ్యోతిబసు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కైకలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా, ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. జ్యోతిబసు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.